118068901

ఉత్త మాటల చేత చిత్తము సత్తు చిత్తానందమొందదు
విత్తనంబులు లేని భూమిలో మొత్తముగ పంటేమి పండదు
కన్నువిప్పి చూడరోరన్నా శ్రీసాయి దేవుని
ఎన్నగా యెందైన గలడన్నా!
మున్నుషిరిడీ నేడు పర్తి ఉన్నవాడని పేరెగాని
తన్ను భావన చేయు భక్తుల కన్నులందే మెలగునన్నా!

విద్యార్థులారా!

భగవంతుని ప్రేమ సర్వుల యందు కూడను సమముగానే వుంటుంది. పరిమళ పుష్పము కుడి చేతియందు ధరించినను ఎడమ చేతి యందు ధరించినను దాని సుగంధము ఒక్కటే. భగవంతునకు ఒకరు హితులని గాని మరొకరు అహితులని గాని లేరు. కానీ మానవుడు తన స్వభావమును పురస్కరించుకొని తాను ఒకగిలిగా భావిస్తుంటాడు. అట్టి మానవుడే భగవంతుని యందు భేదములను గుర్తించటానికి ప్రయత్నిస్తాడు. అట్టి మానవుడే భగవంతుని యందు భేదములను వెతుకుతూ వస్తాడు. అట్టి లౌకిక జ్ఞానము కలిగిన మానవుడు దైవత్వాన్ని చక్కగా గుర్తించలేడు. చేపల వ్యాపారము చేసే వ్యక్తికి రత్నాల విలువ ఏరీతిగా తెలుస్తుంది. 'యద్భావం తద్భవతి'. తమ తమ భావములే యీ మంచి చెడ్డలను ఏర్పరచి, మంచి చెడ్డలను గుర్తింప జేసుకొని తమ విచారమునకు తాము బద్ధులౌతున్నారు. గొడ్డలి గంధపు చెట్టును నిర్దాక్షిణ్యముగా కొట్టుతుంది. కాని గంధపు చెట్టు కినుకను చెందక ద్వేషము పూనక తన సుగంధమును గొడ్డలి కందిస్తుంది. దివ్యత్వము అట్టిదే. మానవులు అజ్ఞానులై మోహాంధకారులై ఆడంబరము చేతను భగవంతుని యనేక విధముల మాటలాడవచ్చును, భావించవచ్చును. ఈ మాటల చేత భగవంతుని బాధించినామని తలంచవచ్చు. కానీ భగవంతుడు దీనికేమాత్రము బాధపడడు. అట్టి దుష్టులకు దుర్మార్గులకు తన సద్గుణములను పవిత్ర భావములను అందిస్తూ వుంటాడు.

మంచి చెడ్డలు పదార్థమునకు రెండు పార్శ్వములు. అయోధ్యావాసులు రామచంద్రునిపైన అనేక విధములుగా భక్తిప్రపత్తులతో వుండినారు. ప్రజలు యెన్ని విధముల ప్రార్థించినప్పటికి వారి మాటలను లెక్కచేయక తాను అరణ్యమునకు ప్రయాణమైనాడు. ఏ ప్రేమను, యే విశ్వాసమును, యే భక్తిప్రపత్తులను యీ రాముని పైన చూపుతూ వచ్చారో, ఆ ప్రజలే తమ అభీష్టమునకు విరుద్ధముగా వెళ్ళుతున్నాడనే భావము చేత అందరు కూడను రాములను కోపంగా చూస్తూ వచ్చారు. రాముల అమృత హృదయుడని భావించాము. నవనీత హృదయుడని

118068902

చింతించాము. మృదు మధురమైన హృదయము కలవాడని భావించినాము. కాని ఇంతటి కఠిన హృదయుడు, ఇంతటి శిలా హృదయుడు అని మేము భావించలేదు అని దూషించారు. ఈ దూషణా భూషణాలకు విరుద్ధమైన రియాక్షను. కనుకనే పదార్థముల భాగములు సుఖ దుఃఖముల చేతను లాభ నష్టముల చేతను, నిందాస్తుతుల చేతను కూడి వుంటాయి. దివ్యత్వమునకు మంచి వారు చెడ్డవారు ఇద్దరూ బాధించే వారే. ఆస్తికులు, నాస్తికులు ఇద్దరు కూడను దూషించే వారే. దివ్యత్వమును మంచి వారు చెడ్డవారు హింసించే వారే. ఏమిటి ఈ హింస యొక్క అంతరార్థము? దీనిని హింస అని ఏ రీతిగా మనము భావించవచ్చును. అని విచారము చేయగా మంచి వారి వియోగమే దుఃఖమునకు మూల కారణము. చెడ్డవారి సంయోగమే దుఃఖమునకు మూలకారణము. ఏతా వాతా సంయోగ వియోగములు రెండును దుఃఖమునకు మూల కారణములే. కనుకనే దివ్యత్వము ఇద్దరినీ ఆశీర్వదిస్తూ వచ్చింది. ఈ ఆశీర్వాదమునకు అంతరార్థమేమిటి? చెడ్డ వారి యొక్క సంయోగము, మంచి వారి యొక్క వియోగము వుండకుండా వుండాలి. అని ఆశీర్వదించాడు. మంచివారి యొక్క సంయోగమును పెంచుకోటము, చెడ్డవారి సంయోగము త్రుంచుకోటము మానవుని ప్రధానమైన సాధనము. ఈ సంయోగ వియోగములు రెండును ఒకే హృదయము నుండి ఆవిర్భవిస్తాయి. ఒకే సముద్రమునందు అమృతము, విషము రెండు పుట్టించాయి. అమృతము ఆనందాన్ని అందించింది. విషము బాధను కలిగించింది. అమృతము కీర్తిని పొందింది. విషము అపకీర్తి నందుకొంది. కనుకనే మానవత్వము ఏ మంచి కీర్తిని సంపాదించగలదో ఆ కీర్తి నిమిత్తమై మంచిని మనము పోషించుకోవాలి. ఈ నాటి మానవుడు పుణ్యఫలమును అమితముగా ఆశిస్తున్నాడు గాని, పుణ్యకార్యములకు ముందంజ వేయటం లేదు. పాప ఫలమును అంగీకరించటం లేదుగాని పాప కార్యములు చేయటానికి ముందంజ వేస్తున్నాడు. ఇదే మూల కారణము. 'పుణ్యస్య ఫలమిచ్ఛంతి పుణ్యం నేచ్ఛంతి మానవాః, న పాప ఫలమిచ్ఛంతి పాపం కుర్వంతి యత్నతః!' అన్నారు. పాప ఫలము వద్దని నీవు విసర్జించినప్పుడు పాపకార్యములలో ప్రవేశించకు. పుణ్యఫలము నీవు ఆశించినప్పుడు పుణ్య కార్యములు చేయటానికి పూనుకో. మానవత్వము లోపల రెండు విధములైన తత్వములు వుంటున్నాయి. కొందరు వృక్షలందు మంచి చెడ్డలు సమ్మిళితమై వుంటుంటాయి. కాకులు చేదు నిమ్మను ఆరగిస్తాయి ఆనందిస్తాయి. కోకిల తియ్యని మామిడి చిగుళ్ళను తిని సంతోషిస్తుంది. అదే విధముగనే కొంతమంది మానవులు లోక విషయ వాసనలు ఆశించి అందులోనే ఆనందముందని విశ్వసించి దాని నిమిత్తమై ప్రాకులాడుతుంటారు. మంచి వారు దివ్యత్వము యొక్క ప్రేమ తత్వము అనుభవించాలని అర్రులు చాస్తూ దాని నిమిత్తమై ప్రాకులాడుతుంటారు. ఈ రెండింటి తత్వమునందు మంచి చెడ్డలు ఇమిడి వుంటున్నాయి. మంచిని ఎప్పుడు బాధలే వెన్నాడుతుంటాయి. ప్రాకృతమైన దృష్టిలో అది ఒక హీనమైన స్థితిగా భావిస్తూ వుంటారు. కోరిన ఫలములు అందించేది కల్పవృక్షము వుంటుందాది. విలువైన రత్నములు అందించే సముద్రము

ఉప్పునీరుగా తయారైంది. కనుక యీ మంచి చెడ్డలయందు మానవత్వాన్ని విచారించి నప్పుడు వాళ్ల అభీష్టముపైన యీ మంచి చెడ్డలు ఆధారపడినవేగాని నిజమైన పదార్థముపైన కాదు.

మానవుడు ఉత్తమమైన భావములను చిత్తమునందు చేర్చుకొని ఆనందాన్ని అనుభవించటానికి తగిన కృషి చెయ్యాలి. మానవుడు తనయందు ప్రేమ తత్వాన్ని పెంచుకోవాలి. ఇచ్చుకోటము, క్షమించుకోటము వీనివల్లనే మన ప్రేమ చింత పెరుగుతుంది. పుచ్చుకోటం చేతను, దానిని మరచిపోవటం చేతను స్వార్థము పెరిగిపోతుంది. ఉపకారము మరచిపోవటమే స్వార్థము పెరగటానికి మూలకారణము. కనుక ప్రేమ తత్వాన్ని పెంచుకోవాలనుకున్నప్పుడు క్షమ, యిచ్చుకోవటం యీరెండింటిని మనము పెంచుకోవాలి.

విద్యార్థులారా! ఈ లేత వయస్సునందు మానవుని మనస్తత్వము విలువ లేనిదిగా మీరు విశ్వసిస్తున్నారు. మానవత్వము చాలా విలువైనది. పవిత్రమైనది. దివ్యమైనది, జీవింప తగినది. అట్టి జీవితాన్ని మనము యీనాడు స్వార్థమనే సంకుచిత భావముతో అనుభవించటం చేతనే మనకు జీవితముపై విరక్తులు ప్రవేశిస్తున్నాయి. మనము నేర్చవలసిన విద్యలు యెన్నియో వుంటున్నవి. నిత్యజీవితములో సత్యమైన తత్వాన్ని గుర్తించే నిమిత్తమై ప్రతిక్షణము ఒక్కొక్క విద్యను మనము అభ్యసించుతూ రావాలి. మాలిన్యమును మనస్సునందు చేరకుండా చూచుకోవాలి. దుష్ట భావములు హృదయములో చేరినప్పటికిని వానిని వెలుపలకు పంపించటానికి ప్రయత్నించాలి. అప్పుడే మన పవిత్రమైన చిత్తము ఉత్తమస్థితినందుతుంది. దక్షిణామూర్తిది మౌనవ్యాఖ్యానము. వచనములతో బోధించే తత్వము కాదు. తన దృష్టి తోడనే విశ్వతత్వాన్ని ఆధ్యాత్మిక భావాన్ని గుర్తింప చేసేవాడు. ఒకానొక సమయములో ప్రయాణము చేస్తూ సముద్రము ఒడ్డుకు చేరాడు. ఓంకారశబ్దముతో నాదము గావించే సముద్రమును చూచి చాలా ఆనందించాడు. శబ్దబ్రహ్మము నిజమైన సముద్రమే. సాగరమునకు అలలే మూలకారణము.

కొలనుకు కలువయే శృంగారము
ఆకాశమునకు చంద్రుడే శృంగారము
సముద్రమునకు అలలే శృంగారము
మానవునకు గుణమే శృంగారము
భక్తులకు నొసట విభూతియే శృంగారము

అన్నాడు. దక్షిణామూర్తి కూడను సముద్రమునకు అలలే శృంగారముగా భావిస్తూ వచ్చాడు. అనగా భగవత్తత్వమనేది ఒక సముద్రము, సర్వవిధములైన జీవులకు ఆదర్శవంతమైనది. ఈ సంసారమును సముద్రముతో పోల్చుకున్నాడు. సముద్రములో

118068904

అలలు ఒకదానిపై ఒకటి యేవిధముగా అభివృద్ధి అవుతూ వుంటాయో అదేవిధముగనే సంసారమునందు ఒకదానిపైన ఒకటి చిక్కులు కలుగుతూ వుంటుంటాయి. బాధలు సంభవిస్తూనే వుంటాయి. ఐతే యీ బాధలు, యీ దుఃఖములు, యీ విచారముల వల్ల ఒక పాఠమును మనము గుర్తించాలి. దీనికి సముద్రాన్ని ఆధారముగా తీసుకున్నాడు దక్షిణామూర్తి. చూస్తూ చూస్తూ వుండగనే గాలికి పెద్ద చెత్త వచ్చి సముద్రములో పడిపోయింది. చెత్త పడిన తక్షణమే సముద్రుడు ఒక్కొక్క అలను మద మద పంపించి ఆ చెత్త గట్టుకు నెట్టించాడు. ఒక్క క్షణమైనా సముద్రము లోపల యీ చెత్తను వుంచుకోలేదు. దక్షిణా మూర్తికి కష్టం కలిగి "సముద్రుడా! నీవెంత నీవెంత స్వార్థపరుడవు. నీవు అనంతమైన, అగాధమైన లోతు వుండినవాడవు. అలాంటి నీవు యింత చిన్న చెత్త నీలో ప్రవేశించిన ఓర్చుకోలేక పోయావుకదా! అంత పెద్దవాడు యింత చిన్న చెత్తను సహించుకోలేక పోవటం యెంత స్వార్థము? ఎంత సంకుచిత భావము?" అన్నాడు. సముద్రుడు చక్కని జవాబు చెప్పాడు దక్షిణామూర్తికి; "దక్షిణా మూర్తీ! నీకు తెలియని విషయము కాదు. ఈనాడు నేను యీ చిన్న చెత్తను నాలో ప్రవేశము చేసుకుంటే రేపటి దినము వచ్చిన చెత్తంతా చేరిపోతుంది. నా రూపాన్నే మరుగు చేస్తుంది. కట్టకడపటికి యీ డస్టు అంతా నా స్వరూప స్వభావాన్నే మరుగు గావిస్తుంది. కనుకనే ప్రారంభమునందే చిన్న చెత్తను కూడా నాలో చేర్చుకోకుండా వుండినప్పుడే నేను పరిశుద్ధముగా వుంటుంటాను. రత్నాలకు నిలయముగా నేనుంటాను!" అన్నాడు. కనుకనే ప్రతి మానవుడు తనయందు కించిత్ భావమనే అపవిత్రము ప్రవేశించినప్పటికి తక్షణమే దాన్ని దూరం చేయుటానికి తగిన కృషి చెయ్యాలి. చిన్నది కదా చిన్నది కదా అనుకుంటే అది కట్టకడపటికి పెద్దగా మారి నీ స్వరూపాన్నే మరుగు చేస్తుంది. నీ మానవత్వాన్నే మరిపింప చేస్తుంది. కనుక మానవత్వాన్ని ప్రకటించుకోవాలి. వికసింప చేసుకోవాలి. అలాంటి పరిస్థితియందు మనలో కొన్ని దుర్భావములో, దుశ్చింతలో, దురాలోచనలో వచ్చినప్పుడు తక్షణమే గుర్తించి ఆ దుర్భావములను దూరము చేసుకోటానికి తగిన కృషి చెయ్యాలి.

ఎంత పెద్దదానినైనా చిన్నదానితో సాధించటానికి వీలవుతుంది. చిన్న చిన్న చీమలంతా చేరి గొప్ప గొప్ప సర్పాలను మరణింప చేస్తాయి. మనము చిన్నవారమనే భావమును యేమాత్రము పెట్టుకోరాదు. మనము చేయవలసిన కర్తవ్యాన్ని నిర్వర్తించుటానికి తగిన శక్తిని సంపాయించుకోవాలి. లోకము లోపల మంచికి అన్ని చెడ్డలు తగులుతూ వుంటాయి. కోకిల గానము కాకులకు కర్ణకఠోరముగా వుంటుంటాది. హంస రూపాన్ని చూచి కొంగలు పరిహాసిస్తూ వుంటాయి. అంతమాత్రముచేత హంసలకు పోయేదేమి లేదు. ఇలాంటివి జగత్తులో అనేకము వెంటాడుతూనే వుంటాయి. వెంటాడుటయే కాదు రెండు జంట పక్షుల వలె వుంటాయి. మనము దీనికేమాత్రము లొంగకూడదు. వంగకూడదు. దానిని ఎదుర్కొని పోరాడి సత్యాన్ని గుర్తించి దాన్ని సాధించాలి. విజయాన్ని

సాధించాలి. సుఖశాంతులు కావాలని మనం కోరుతున్నాము. ఈ సుఖశాంతులు మనకు ఎక్కడనుండి లభిస్తాయి? సుఖశాంతులన్నీ కేవలము మన మనో నిగ్రహం చేతనే సంభవిస్తాయి. ఈ మనో నిగ్రహము యే రీతిగా మనకు ప్రాప్తిస్తుంది? ఒక్క దైవము యొక్క సన్నిధి చేతను సన్నిధి చేతను మనము నిగ్రహాన్ని సాధించవచ్చు. కనుకనే భగవద్గీత యందు విజయాన్ని సాధించాలి శాంతిని అనుభవించాలి అని కోరినప్పుడు దీనికి చక్కని జవాబు అందించాడు. ఒరే పిచ్చివాడా! నీవు ఆశించేది శాంతి సుఖములు, నీవు కోరేది విజయాన్ని ఈ రెండూ నీకెట్లా లభిస్తాయి?

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ.

ఎక్కడ భగవంతుడైన కృష్ణుడుంటాడో ఎక్కడ పార్థుడు అనగా అర్జునుడు కాదు. పృథ్వీపుత్రుడైన మానవుడు, ఎక్కడ భగవంతుని పక్కలో మానవుడుంటాడో, ఎక్కడ మానవుని పక్కలో భగవంతుడుంటాడో అక్కడే నీకు విజయము లభిస్తుంది. ధృఢమైన విజయాన్ని సాధిస్తావు. కనుక విజయాన్ని ఆనందాన్ని సుఖాన్ని నీవు కోరినప్పుడు నీహృదయము లోపల భగవంతుని ప్రతిష్ట వేసుకో. నీకు నీవు ప్రశ్నించుకున్నప్పుడు భగవంతుడెక్కడ వున్నాడని. ఎక్కడ వుంటున్నాడంటే నీవు నిత్యము చేసే ప్రార్థన యందే వుంటున్నాడు. ఆ ప్రార్థన నుండియే నీకు జవాబు వస్తున్నాడు. పిల్లలు నిత్యము భుజించే సమయములో అందరు కాదు కొందరు చెబుతుంటారు

బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతం
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మ కర్మ సమాధినా.

భగవంతునికి నేనర్పిస్తున్నాను అనుకుంటావు. కాని భగవంతుడేమి జవాబు చెప్తున్నాడు. 'అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః' ఈ దేహాన్ని ధరించిన ప్రాణుల లోపల నేను వైశ్వానర రూపములో వుండి నీవు భుజించినదంతా జీర్ణింప చేస్తున్నాను నాయనా! కనుక భగవంతుడెక్కడ వున్నాడని ప్రశ్న వేసుకుంటే 'అహం వైశ్వానరో భూత్వా' లోపలినుండి వస్తుందా ది జవాబు. కాని యీ జవాబు నీవు లెక్క చేయటం లేదు. నిజముగా యీ దేహమునందు జీర్ణకోశము సరిగా పని చేయకుండిన మనము భుజించిన ఆహారము యేమైపోతుంది?

జీర్ణకోశాలు దేహాన చేర్చెనెవరు?
జనన మరణాలు నెవరిచే జరుగుచుండె?
అతని గుర్తింప నేర్వరైరి యీ మూఢ మానవులు.

సృష్టించటం నీ చేతనౌతుందా? మరణింప చేయవచ్చు. కాని మరణించిన వాళ్ళే బ్రతికింప నీ చేతనౌతుందా? ప్రతి ఒక్కటి కూడను భగవత్సంకల్పమే. అట్టి సంకల్పాన్ని విశ్వసించలేక పోతున్నారు మానవులు. విశ్వాసమే లేకుండిన మానవుడు యే మాత్రము శాంతి జీవిత

118068906

మను గడుప లేదు.

భగవద్విశ్వాసాన్ని పెంచుకోవాలి. భగవంతునికి ఆగ్రహము, అనుగ్రహము రెండూ లేవు. మీ భావాన్ని బట్టి తాను ఆడుతూ వుంటాడు. ఒక యినమును అక్కడ పెడితే యినుము అటు తిరగటానికి గాని యిటు తిరగటానికి గాని స్వతహ శక్తి లేదు. కాని మధ్యలో magnet పెట్టి దాన్ని యిటు తిప్పితే యినుము కూడా యిటు తిరుగుతుంది. అటు తిప్పితే అటు తిరుగుతుంది. ఆ magnet యొక్క శక్తి చేతనే యినుము కదలగలుగుతున్నది. Magnet లేకపోతే యినుమునకు యేమాత్రము చైతన్యశక్తి లేదు. కనుకనే మానవత్వము లోపల రెండు విధములైన తత్వాన్ని మనము గుర్తించాలి. మంచిని అందుకోటమే కాకుండా దైవత్వములో తనకు తాను శిక్షింప చేసుకుంటున్నాడు మానవుడు. చెప్పాను. గొడ్డలి గంధపు చెట్టును కొట్టింది. కాని గంధపు చెట్టు తన సుగంధమును గొడ్డలి కందించింది. గొడ్డలిని గంధపు చెట్టు యేమాత్రము ద్వేషించ లేదు, దానిని యేమాత్రము తూలనాడ లేదు. తాను చేసిన చెడ్డతనమునకు తానే అనుభవిస్తుంది ఈ గొడ్డలికి వచ్చే చెడ్డ అనుభవము యేమిటి? గొడ్డలికి అగ్ని పరీక్ష జరుగుతుండాది. గొడ్డలి సుత్తి వేటు తింటుండాది. చూశారా! ఏ విధముగా సుగంధము నందుకున్నప్పటికిని గొడ్డలి తిరిగి మొద్దుబారినప్పుడు అగ్ని పరీక్ష జరుగుతున్నది. అగ్నిలో వేస్తున్నారు గొడ్డలిని. కేవలము అగ్నిలో వేయటం మాత్రమే కాదు. సుత్తితో కొడుతున్నారు. ఈ punishment భగవంతుడిచ్చినదా? కాదు. కాదు. తాను చేసిన చెడ్డతనమునకు భగవంతుడు మంచినిచ్చినప్పటికిని తన చెడ్డతనమే తనకు చెడ్డ నందిస్తుండాది. కనుక భగవంతుడు చెడ్డ నివ్వనక్కర లేదు. భగవంతుడు శిక్షనివ్వనక్కర లేదు. తనకు తానే శిక్షింపబడుతున్నాడు. బంగారు మంచి విలువైనది. కంసాలి దానిని అగ్నిలో వేసి కరగిస్తున్నాడు. విలువైన బంగారును అగ్నిలో వేసి హింసిస్తున్నప్పటికిని ఆ బంగారు ఆనందిస్తూనే వుంటున్నది. కారణ మేమనగా నేను మరింత పరిశుద్ధమై పోతున్నాను, నేను అపరంజిగా మారుతున్నానని తానానందిస్తుండాది. వెల ఎక్కుతుండాది దానికి. కానీ ఓ బంగారు పనివాడా! కంసాలీ! నీవు అనుభవించే బాధలను నీవు గుర్తించుకోవాలి. నీవు నన్ను యెంత శిక్షించినప్పటికి నేను మరింత విలువైనదిగాను మరీ పరిశుద్ధమైనదిగాను అవుతున్నాను. కానీ ఆ పొగ చేత కన్నులు మండేది నీకే. ఆ అగ్నినుండి వచ్చిన నెరుసులు నీ బట్టలను మలినం చేస్తున్నాది. నీ బట్టలను మాలిన్యము చేయుటమే కాకుండా నీ దృష్టిని కూడా చెడుపుతున్నాది. ఇది నీకే కష్టం గానీ నాకు కాదు అంటుంది బంగారు. కనుక భగవంతుని విషయంలో మంచి చెడ్డలు యేమాత్రము భావించరాదు. భగవంతుడు సాక్షీభూతుడు. నీవు Switch on చేసుకుంటే Fan తిరుగుతుంది. చల్లనిగాలి వస్తుంది. తెల్లని లైటు వస్తుంది. Switch off చేసుకుంటే వేడి నందిస్తుంది. చీకటిలో నీవు బాధపడవలసి వస్తుంది. లైటు వేయక పోవటం వలన లైటుకొచ్చే నష్టమేమీ లేదు.

118068907

Fan వేసుకోక పోవటం వలన ఫ్యాను కొచ్చే నష్టమేమీ లేదు. ఆ నష్టము ఆనందము మీకు. కనుకనే నీవు వుపయోగించుకునే విధానాన్ని సరియైన రీతిలో గుర్తించాలి. ఒక్కొక్క ప మయమం లోపల అన్నింటికిని ఆధారమైనది దైవత్వము. ఆధారమైన దానిని మనము ప్రాధేయ పడకుండా ఆధేయమైన యీ దేహముపైన మనము ఆధార పడుతున్నాము. దీని ద్వారా మనము మోహమునకు గురౌతున్నాము. ఈ మోహము చేత విచారములో మునగు తున్నాము. ఈ విచారము చేత శక్తివంతా కోల్పోతున్నాము. మానవుడు యీ సుఖ సంతోషము లవలన నేను భోగ భాగ్యము లనుభవిస్తున్నాను అనుకుంటున్నాడు. చాలా పొరపాటు. నీవు భోగాన్ని అనుభవించటం లేదు. భోగమే నిన్ను అనుభవిస్తుందాది. అందుచేతనే నీయిం ద్రియాల పటుత్వము తగ్గిపోతుందాది. నిజముగా నీవు భోగములే అనుభవించిన వాడవ యితే నీవెందుకు శక్తివంతుడు కాకూడదు. భోగములే నిన్ను అనుభవించటం చేత నీవు బలహీనుడై పోతున్నావు. వృద్ధుడై పోతున్నావు. రోగములకు గురౌతున్నావు. కనుకనే

జన్మదుఃఖం జరాదుఃఖం జాయాదుఃఖం పునః పునః

అంత్యకాలే మహాదుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత.

విద్యార్థులారా! యీ లౌకికమైన భోగ భాగ్యములు నిత్యములు కావు. సత్యములు కావు. అవి మనము కోరవలసినదే. అనుభవించవలసినదే. కాని లక్ష్యము మాత్ర ము దివ్యత్వముపైనుంచుకోవలసినదే. కనుకనే పారమార్థిక దృష్టితో ప్రాపంచిక వ్యవ హారములో మనము జీవించటము చాలా మంచిది. ఆ విధమైన జీవితమును గడిపినప్పు డే లోక సంబంధమైన విద్యలు ఐహిక ఆముష్మికమైన ఆనందములు అన్నింటియందు విజయాన్ని సాధించగలము. నిత్యము యీ పిల్లలకు చక్కని కొన్ని ఆదర్శవంతమైన అనుభూతులు, వాక్యములు స్మరించటము వినిపించటము యీ విధముగా జరపటము చేత మనము యెంతో కొంత వుపకారము చేసినవారమవుతాము. ఈ కారణం చేత కొన్ని మంచి గ్రంథాలు చదవటానికి ప్రయత్నిస్తారు. ప్రతిదినము యిద్దరిద్దరు విద్యా ర్థులు ఒక ఆధ్యాత్మిక విషయమునందుగాని లేక మీ పరిణామమునందుగాని, మీ అను భూతి యందుగాని జరిగినవి మీతోటి స్నేహితులకు విద్యార్థులకు, మీ సోదరులకు అందించటము అత్యవసరము. ఇట్టి ఉత్సాహ ప్రోత్సాహములు మీకందించి పారమార్థిక తత్వాన్ని మీ హృదయములో ప్రవేశపెట్టే నిమిత్తమై నేను యీ కార్యక్రమము యీనాడు ప్రారంభించాను. లోక సంబంధమైన విషయాలలో మనము జీవితాన్ని వ్యర్థము చేయ కూడదు. ఏదో మీ చదువు మీ పనులు, మీ కాలమునంతా చూస్తున్నారుగాని దినము నకు ఒక గంటైనా యీ ఆధ్యాత్మిక జీవితాన్ని మీ హృదయములో చేర్చుకోవాలి. రేపటి నుండి ఐదు గంటలకు యీ సమావేశము ప్రారంభమై ఆరుగంటలవరకు వుంటాయి. ఈ సత్సంగము లోపల జీవితాన్ని సార్థకం చేసుకోండి. 1st Speaker సాయినాథుడు

118068908

చెప్పాడు. నామస్మరణ అనే దాంట్లో వున్న పవిత్రత, నామచింతనలో వుండిన ఫలము మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. తుకారాం చెప్పాడు. 'నామ నిరూపణ మలా రతనతే!' నామమనే రత్నమును గుర్తించుకున్న వానికే అర్థమవుతుంది. తెలియని వారికి కేవలము సామాన్యమైన పదములుగా రూపొందుతాయి.

విద్యార్థులారా! ఇది చాలా పవిత్రమైన వయస్సు. భగవన్నామస్మరణ అత్యవసరము. దీనిని మీరు చులకనగా భావిస్తున్నారు. చాలా పొరపాటు. లోకములో నామము చేత సాధించలేనిది ఒక్కటి కూడను లేదు. నామిని కూడను నామము చేతనే సాధించవచ్చును. నామి అనగా రూపము. ప్రపంచములో ఒక వస్తువును మనం కొనాలంటే యేమేమి మన చేతిలో వుండాలి. ధనము చేతిలో వుంటుంటే యెలాంటి వస్తువునైనా మనము కొనవచ్చు. అప్పుడు ధనము గొప్పదా లేక వస్తువు గొప్పదా? ధనమే గొప్పది. ధనము వుంటేనే మనము వస్తువులను పొందవచ్చు. ఈ జగత్తునందున్న సుఖము సంతోషము ఆనందము ఫలము విజయము అనే వస్తువులను మనము పొందవచ్చు. ఈ జగత్తునందున్న సుఖము, సంతోషము, ఆనందము, ఫలము, విజయము అనే వస్తువులను కొనాలంటే భగవన్నామమనే ధనము మనము సాధించాలి. ఆ ధనమును మనము పోగు చేసుకోవాలి. ఆ ధనము చేతనే మనయొక్క గుణమును పోషించుకోవచ్చు. గుణమే మానవునకు ప్రధానము. ఆ గుణమనే ధనాన్ని మీరు యీ వయస్సులో చాలా అభివృద్ధిగావించుకోవాలి.

విద్యార్థులారా! ఒక చిన్న ఉదాహరణము తీసుకోండి. మన జీవితము ఒక వృక్షము. ఈ వృక్షము లోపల మన బంధువులు మిత్రులు కొమ్మలు రెమ్మల వంటి వారు. మన thoughts యీ చెట్టు పుష్పముల వంటివి. మన యొక్క ఆనందమనే ఫలములోపల character అనే juice వుంటుండాది. కాని చెట్టుకు మూలాధారమైనది యేది? వేరులు. క్రింద roots పైన fruits లేకపోతే యిది fire wood అవుతుంది. వృక్షము కాదు. ఐతే యీ వృక్షముపైన అప్పుడప్పుడు కామ క్రోధ లోభ మోహములనే పక్షులన్నీ చేరిపోతుంటాయి. ఈ పక్షులు చేరటం చేత యేమి జరుగుతుండాది. కేవలము అలజడి కలిగిస్తుండాది. చెట్టు క్రింద అశుద్ధము చేస్తుండాది. అందువల్లనే యీ వృక్షము క్రింద మనము చేరి, చెట్టు పైన చేరిన పక్షులను యేరీతిగా తరిమి కొడుతున్నాం. ఇష్ష్ ఇష్ష్ అన్నప్పుడు నోటి శబ్దం చేతను చేతి శబ్దము చేతను అవన్నీ పరుగెత్తిపోతాయి. కాబట్టి దేహమనే యీ చెట్టు లోపల హృదయమనే స్థానములో నీవు కోరి 'రామా కృష్ణా గోవిందా' అని శబ్దము చేస్తే ఆ పక్షులంతా పరుగెత్తిపోతాయి. ఇప్పుడు కూడను యీ మూడు పరిశుద్ధమైపోతాయి. ఏమిటి యీ మూడు. మనస్సు, వాక్కు, కాయము. దీనినే వేదాంతములో త్రికరణ శుద్ధి అన్నారు. మనస్సులో పుట్టిన రామా, కృష్ణా అనేది వాక్కులో రావాలి. వాక్కులో వచ్చిన దానికి యీ చేతులు తాళము వెయ్యాలి. వాక్కనే పాటకు మనస్సనేది శృతి చేతులు అనేది తాళము. శృతిలయ రాగ తాళములతో కూడినప్పుడే మనకు త్రికరణ శుద్ధి జరుగుతుంది.

118068909

చాలామంది పిల్లలనుకుంటారు. నేను మనసులో పాడుకుంటాను లే బయటకు చెప్పాలా అని అంటారు. ఇది పూర్తి అజ్ఞానము. వంట యింట్లో వుంటుండాది వంట. నేను మనసులో తినుకుంటే చాలనుకున్నావా? నీకు తట్టలోకి రావాలి. తట్టలోది పొట్టలోకి చేరాలి. అప్పుడుగాని నీ ఆకలి తీరదు. కాబట్టి మనస్సులో వుంటే ప్రయోజనము లేదు. మనస్సులోది మాటలోకి రావాలి. మాటలో వచ్చింది నీ కర్ణములో చేరిపోవాలి. మాటనుంచి బయటకి వచ్చింది. కర్ణమునుంచి లోపలికి పోయింది. కనుక యీ విధమైన ఆహారాన్ని నీవు భుజించాలి

విద్యార్థులారా! దారి తప్పి నడచిన మానవులకు దేహము ప్రమాదములో చేరుతుంది. నీతి తప్పి నడచిన మానవునకు మానవత్వము కోల్పోతుంది. మనము మానవత్వాన్ని కోల్పోయేటట్టుగా చేసుకోకూడదు. కొందమంది పాటలు పాడుతూ పెదవులు అల్లాడిస్తూ వుంటారు. ఊగిస్తూ వుంటారు కదలిస్తూ వుంటారు. అది సరియైనది కాదు. బావిలో పడిన వ్యక్తి నేను బావిలో పడ్డా అని మెల్లగా అంటే యెవరూ వచ్చి రక్షించరు. అయ్యో! నేను బావిలో పడ్డానని గట్టిగా అరిచేటప్పటికి చుట్టుప్రక్కలవారంతా వచ్చి రక్షిస్తారు. అదేరీతిగానే హృదయమనే బావిలో పడినటువంటి నీవు లోలో లోపల తలచుకుంటూ వుంటానంటే రాదు. గట్టిగా చెప్పాలి. అదియే సమ్యక్ కీర్తనం యితి సంకీర్తనం అన్నారు. గొంతు వుండినంతవరకు దీనిని యెత్తి పాడాలి. ఎందుకు గొంతు యిచ్చినది. పిచ్చి పిచ్చి మాటలు చెప్పుకోటానికా? చెప్పుకోవచ్చు. భగవన్నామమునకు హద్దే లేదు. సంకీర్తనము స్వాతంత్ర్యముగా పాడాలి. ఏవిధమైన అదుపులు పెట్టుకోకూడదు. మన S.Kumar చెప్పుతుంటాడు. ఊ ఊ అని. ఒక పదము కూడను స్పష్టముగా రాదు. పదము స్పష్టముగా రావాలి. 'రామా' అనేది మెల్లగా రామా అనుకుంటే ఎట్లా వుంటుంది? కంఠము చక్కగా యెత్తి నాలుకను చక్కగా కదలించి సుస్వరముతో భజన చేయాలి. ఇంకొకటి కూడా మీరు గుర్తించాలి. మనము పాడే పాటలు మనము మాత్రమే కాదు వినేది. వేలమంది వింటున్నారు. వారి హృదయానికి ఆనందాన్నందించే రీతిగా మనము పాడాలి. నీకు నీవు యీ ఆనందాన్ని నింపుకొని యితరులకు కూడను యీ ఆనందాన్ని పంచాలి. Street light వుంటుంటాది. మీరు చూశారా? ఈ Street light లో బల్బులంతా పెట్టి వుంటారు. ఆ లైటు పోల్ పై వుంటుంది. కానీ ఆ లైటు రోడ్డులో నడిచేవారికి చూపిస్తుంది. తన రూపాలు కూడా తాను చూపుతుంటుంది. అదే రీతిగా యీ భజన తనకు తాను తృప్తిగావాలి. యితరులకు తృప్తి చెయ్యాలి. Follow చేసే వారు యెట్లా చేసినా ఫరవాలేదు. కానీ lead చేసేవారు చక్కగా చెయ్యాలి. Lead చేయవలసిన వారు చక్కగా Practice చేసుకోండి. ఎన్నో వేలమంది వినేవారుంటారనే విషయాన్ని మీరు గుర్తుపెట్టుకోవాలి. శృతిలయ రాగతాళములతో కూడి వుండాలి. దానిలో వచ్చినదే మనదేశమునకు పేరు. మనదేశము ఏమిటి? కొత్త పిల్లలంతా వుంటున్నారు. భారతదేశము. భా-ర-త మూడు

118068910

అక్షరములతో కూడిన పదము. భావరాగతాళములతో కూడినదే మన భారత దేశము. అప్పుడే దేశమునకు సరైన సార్థకత నందించిన వారమౌతాము. విద్యార్థులారా! భజన హృదయపూర్వకముగా గొంతెత్తి స్వేచ్ఛగా మీరు పాటలు పాడుతూ రావాలి. సామూహిక భజన చాలా సార్థకమైనది. దీనిని మొట్టమొదట గురునానక్ స్థాపించాడు. కేవలము వ్యక్తి వ్యక్తి మాత్రమే పాడుకుంటే ప్రయోజనము లేదు. అందరి గొంతులు ఒకదగ్గర చేరాలి. అందరి చేతులు ఒక శబ్దములో చేరాలి. అందరి హృదయాలు ఒకదానిలో చేరాలి. కాబట్టి అందరు కలసి ఒక్క స్వరముతో పాడితే యెంత ఆనందముగా వుంటుంది. కర్ణానందముగా వుంటుంది. ఒక్కొక్కరు ఒక్కొక్క రకముగా పోతే కర్ణ కఠోరముగా వుంటుంది. కర్ణానందానికి తగినట్లు యేర్పడినదే యీ నామస్మరణ. ఈ భజనలవలన దివ్యత్వాన్ని అందుకోటానికి కృషి చేయండి. దీనిని మనము చింతిస్తేనే ఆరూపాన్ని మనము పొందుతాము. కనుకనే హృదయాన్ని చేర్చి ప్రేమతో భగవంతుని నామమును మీరు స్మరించాలి.

ఈనాడు లోకములో యిలాంటి పవిత్రమైన వాతావరణము లేకపోవటం చేత భావములు చలించిపోతున్నాయి. విద్యార్థులారా! ఒకవిషయాన్ని గుర్తించండి. మనం పీల్చుకొనే గాలి యెక్కడ వుంటుంది? సర్వత్రా వుంటుంది. ఈ గాలిలో యేమి చేరి వున్నాయి. దుశ్శబ్దములంతా చేరి వుంటున్నాయి. ఈ గాలిని మనము లోపల చేర్చుకోటం చేతనే మనలో దుర్భావములంతా చేరుతున్నాయి. ఎట్టి మంటనో అట్టి పొగ. ఎట్టి పొగనో అట్టి మేఘము. ఎట్టి మేఘమో అట్టి వర్షము. ఎట్టి వర్షమో అట్టి పంట. ఎట్టి పంటనో అట్టి వంట. ఎట్టి ఫుడ్డో అట్టి హెడ్డు. కనుక మన తల చెడిపోవటానికి మూలకారణం యేమిటి? మనం పీల్చుకొనే గాలిలో వున్న దోషములే. ఢిల్లీలోనో మద్రాసులోనో, బెంగుళూరులోనో ఎక్కడో ఆకాశవాణి శబ్దాలంతా యీగాలిలో వుంటున్నాయి. ఇట్టి శక్తి శబ్దములంతా సర్వత్రా వ్యాపించిపోతున్నాయి. దానినే మనం పీల్చుకుంటున్నాము. కాబట్టి యేవేవో దుర్భావములు దుశ్చర్యలంతా యీ శబ్దములంతా చేస్తుంటాయి. ఏమిటి యీ అర్థములేని songs అంతా చేరిపోతున్నాయి యీగాలిలో. ఏదో రేడియో వేస్తారు. బజారులో పెండ్లికోసమని గ్రామఫోన్ రికార్డు వేస్తుంటారు. దీనిలో అర్థములేని పాటలంతా వస్తుంటాయి. అవన్నీ యీ గాలిలో చేరుతున్నాయి. దానిని మనము పవిత్రము చేయాలి. సుందరయ్య చెప్పాడు pollution అని. ఆయొక్క దానిని పవిత్రము చేసుకుంటూ రావటానికి నామస్మరణ అత్యవసరము. మనము భగవన్నామాన్ని చేయకపోతే అవేవచ్చి మనలో చేరుతుంటాయి. అర్థములేని పదాలు సార్థకము కావాలంటే దైవనామాన్ని ఆధారం చేసుకోవాలి. లేకపోతే ఆ tape recorder లో వస్తుంటాయి. లేకపోతే గ్రామఫోను ప్లేటులో వస్తుంటాయి డడడా డడడా ఏమిటది?! ఇలాంటి పాటలంతా వస్తుంటాయి. ఈ పాటలు మనలో చేరతాయి. మనము డడడా అయిపోతా

ము. దీనివలన వచ్చే ఫలిత మేమిటి? రామా కృష్ణా గోవిందా అనే శబ్దాలంతా వస్తే మనలో ఆ శబ్దాలు ప్రవేశిస్తాయి. మన నుంచి కూడను ఆ శబ్దాలు ఆవిర్భవిస్తాయి.

విద్యార్థులారా! మీరు చక్కగా భగవత్తత్వాన్ని తెలుసుకోటానికి ప్రయత్నించండి. స్వామి ఇక్కడ యే కార్యక్రమమూ, యే చిన్న విషయమూ తలచినప్పటికిని ఒక అంతరార్థముతోనే కూడి వుంటుంది గాని అర్థములేని పనులు ఇక్కడ యేమాత్రం జరగటంలేదు. అది యీ స్థితిలో యీ పరిస్థితిలో మీకు అర్థము కాదు. క్రమక్రమేణా దీన్ని తెలుసుకొని కొంతవరకు అనుభవించటానికి పూనుకుంటారు. కనుక భగవన్నామ స్మరణము అలక్ష్యము చేయకండి. విశ్వాసాన్ని పెంచుకోండి. ఈనాడు లోకములో ఆ విశ్వాసము లేకపోవటంచేతనే అనేక రకములైన దుర్మార్గాలు జరుగుతున్నాయి. లోకము లో చదువులు లేకుండా పోలేదు. చదువుకున్నవారు కావలసినంత మంది వున్నారు. కాని వారియందు చిత్తశుద్ధి లేదు. ఇంద్రియనిగ్రహము లేదు. మొన్న చెప్పాను. రావణుడు అరువదినాలుగు విద్యలు చదువుకున్నాడు. రాముడు ముప్పదినాలుగు విద్యలు మాత్రమే నేర్చుకున్నాడు. విద్యా విజ్ఞానము లోపల రామునికంటె గొప్పవాడు రావణుడు. కాని రామునకు, రావణునకు వుండిన వ్యత్యాస మేమిటి? రాముడు జ్ఞాని. రావణుడు అజ్ఞాని. ఈ అజ్ఞానమునకు జ్ఞానమునకు వున్న వ్యత్యాసము యేమిటి? ఇంద్రియములను నిగ్రహించుకున్నవాడు రాముడు. ఇంద్రియములకు వశమైనవాడు రావణుడు. కనుకనే వాల్మీకి 'రావణో నామ మూర్ఖో' రావణుడు పరమ మూర్ఖుడు అన్నాడు. విద్య లేదా రావణునికి. వుంది. విద్య వుంటుండి కూడా ఇంద్రియాలకు వశమైపోయాడు. కనుక senses ను control చేసుకోటానికి తగిన కృషి చెయ్యాలి. అవి మనం control చేయకపోతే మనలను అన్ని విధాలా భ్రష్టు పట్టిస్తాయి. మన మానవత్వాన్నే ముంచివేస్తాయి. అపకీర్తుల పాలు చేస్తాయి. కనుక నామస్మరణ మీరు ఆధారం చేసుకొని దీనినే ఒక నావగా భావించుకొని సంసార సాగరాన్ని దాటటానికి పూనుకోండి.